తప్పిపోయిన చిన్నారి పోలీస్‌స్టేషన్‌కు...

మణికొండ: రోడ్డుపై ఏడుస్తూ కనిపించిన బాలికను నార్సింగి పోలీసులు చేరదీసి, అమీర్‌పేటలోని శిశువిహార్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలీస్ అకాడమీ వద్ద గుర్తు తెలియని బాలిక(5) ఏడుస్తూ కనిపించింది. తన పేరు, తల్లి తండ్రుల పేరు చెప్పలేక పోయింది. బాలికకు గుండు ఉండటంతో తల్లి తండ్రులతో ఏదైనా తీర్థయాత్రకు వెళ్లివస్తుండగా తప్పిపోయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. బాలికకు చెందిన వారు ఎవరైనా ఉంటే నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

ఆర్ట్ గ్యాలరీని తిలకించిన ఎమ్మెల్యే



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని కెన్వాడ్ అపార్ట్‌మెంట్ క్లబ్ హౌస్‌లో శివరాంపల్లి జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయురాలు రూప గీసిన ఆర్ట్ గ్యాలరీని ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మంగళవారం సందర్శించారు. 3 రోజుల పాటు ఈ ఆర్ట్ గ్యాలరీని ఏర్పాటు చేశారు. రూప గీసిన దాదాపు 150 చిత్రాలను ఈ ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ... ఆసక్తి ఉన్న రంగాల్లో విద్యార్థులను ప్రోత్సాహించాలని అన్నారు. ఉపాధ్యాయురా విద్యార్థులకు విద్యాబోధన చేస్తూనే తన చిత్రకళ నైపుణ్యానికి మెరుగులు దిద్దుతున్నారన్నారు. రూప నలుగురికి ఆదర్శంగా నిలుస్తారని వెల్లడించారు. చిత్రకళలో ఆమె చూపుతున్న నైపుణ్యాన్ని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశంసించారు.

పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడి నియామకం



జల్లపల్లి నరేందర్

శంషాబాద్: పీసీసీ ఎస్సీసెల్ సీనియర్ ఉపాధ్యక్షుడిగా జల్లపల్లి నరేందర్ నియమితులయ్యారు. పీసీసీ ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రీతమ్ మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో నలుగురిని సీనియర్ ఉపాధ్యక్షులుగా నియమించారు. అందులో జల్లపల్లి నరేందర్‌కు పదోన్నతిని కల్పించారు. సుమారు మూడు దశాబ్దాలుగా పార్టీలో క్రియాశీలయ రాజకీయాలు చేస్తున్న నరేందర్ నియామకం పట్ల కాంగ్రెస్ నేతలు హర్షం వ్యక్తం చేశారు. మరోసారి బాధ్యతలు అప్పగించినందుకు ఆయన ఎస్సీసెల్ అధ్యక్షుడు ప్రీతమ్ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలి



ర్యాలీ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

శంషాబాద్: వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ సీఐ రాజు సూచించారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని ట్రాఫిక్ పోలీసులు ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

నార్సింగి సీఐగా హరికృష్ణారెడ్డి

మణికొండ: నార్సింగి పోలీస్‌స్టేషన్ సీఐగా జి.హరికృష్ణారెడ్డిని సోమవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ మహంతి నియమించారు. గతంలో సీఐగా పనిచేసిన శివకుమార్‌ను హైదరాబాద్ కమిషనరేట్‌కు బదిలీ చేసిన విషయం తెలిసిందే. కొంత కాలంగా క్రైం సీఐ శ్రీనివాస్ ఎస్‌హెచ్‌ఓగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో సీపీ కార్యాలయంలో పనిచేస్తున్న జి. హరికృష్ణారెడ్డిని నార్సింగి ఎస్‌హెచ్‌ఓగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం సీఐగా బాధ్యతలు తీసుకోవచ్చని పోలీసులు తెలిపారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఉద్యోగులు



ఉపముఖ్యమంత్రిని కలిసి వ్యవసాయ విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగస్తులు

ఏజీవర్సిటీ: ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎస్సీ, ఎస్టీ టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి సమస్యలను ఉప ముఖ్యమంత్రి కి వివరించి, విశ్వవిద్యాలయానికి రావాలని విన్నవించారు. తప్పని సరిగా విశ్వవిద్యాలయానికి వస్తానని మీకు ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని వారికి ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ అధ్యక్షుడు బాలాజీ నాయక్, ఉపాధ్యక్షులు పరమేష్, అసోసియేట్ అధ్యక్షులు జయరాం, లత, సత్యనారాయణ, రాజు ,అరుణ్ పాల్గొన్నారు.

జీఓ 55ను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి



ప్రజావాణిలో వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు

ఏజీవర్సిటీ: ఉద్యాన వన విశ్వవిద్యాలయాలకు సంబంధించిన భూములు హైకోర్టు నూతన భవనాలకు ఇస్తు ప్రభుత్వం తెచ్చిన జీఓ 55ను వెనక్కి తీసుకోవాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రజావాణి నోడల్ అధికారికి ఈ విషయాని పూర్తిగా వివరించారు. ఈ విషయాని ముఖ్యమంత్రి, మంత్రి మండల దృష్టికి తీసుకపోతామని అధికారులు తెలిపినట్లు విద్యార్థులు తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో రాజ్‌కుమార్, సురేష్, భానుచందర్, సురేందర్, మధుకర్, సత్యమూర్తిలు ఉన్నారు.

యువత వ్యాపారంలో రాణించాలి

గోల్కొండ: యువత వ్యాపార రంగంలో రాణించాలని ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన రిసాలబజార్‌లో హిమార్ ఎంటర్‌ప్రైజెస్‌ను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ వ్యాపారంలోకి రావాలనుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ముందుకువస్తున్నాయన్నారు. తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్, హిమార్ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ మహ్మద్ నజీబ్, ఖాలేద్ ఆలీ ఖాన్, ఉస్మానియా మజీద్ కమిటీ అధ్యక్షుడు మహ్మద్ హుస్సేన్, ఖాదర్, జలీల్ ఉన్నారు.

ఇదేం ఎజెండా?

- అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్‌లు
- అత్యవసర పనులే చేపట్టాలని పట్టు
- సర్వసభ్య సమావేశంలో నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే వాటిని గాలికి వదిలి పాత చింతకాయ పచ్చడి పనులను చేపట్టాలని ఎజెండాలో ఎలా పెడతారని మెజార్టీ కౌన్సిలర్‌లు అధికారులను నిలదీశారు. 5 నెలలకు సమావేశం ఏర్పాటు చేయటం, అందులోని ఎజెండాలో సమగ్ర విషయాలు పెట్టకుండ టేబుల్ ఎజెండా అంటూ ఇప్పటికిప్పుడు తెరమీదకు తేవటం ఏమిటని ప్రశ్నించారు. అలాంటి ఎజెండాలను అంగీకరించే ప్రసక్తే లేదని, అందరు కౌన్సిలర్‌లను సంప్రదించి అత్యవసర పనుల వివరాలను తీసుకుని మరోసారి సమావేశం ఏర్పాటు చేయాలని, ప్రస్తుత సమావేశపు ఎజెండాను 11 మంది కౌన్సిలర్‌లు తిరస్కరించారు. మణికొండ మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం మంగళవారం చైర్మన్ కె.నరేందర్ ముదిరాజ్ అధ్యక్షతన వాడి వేడిగా కొనసాగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ హాజరయ్యారు. ఎజెండాలో చేపట్టాల్సిన పనులలో ప్రజలకు ప్రస్తుతం వెంటనే అవసరమైన పనులకంటే కాంట్రాక్టర్‌లకు, కమిషన్ దారులకు మేలు జరిగేవే ఎక్కువగా ఉన్నాయని, వాటిని తిరస్కరిస్తున్నామని మెజార్టీ కౌన్సిలర్‌లు అభ్యంతరం తెలిపారు. మున్సిపాలిటీలో పారదర్శకత పూర్తిగా లోపించిందని ఆరోపించటంతో కమిషనర్, కౌన్సిలర్‌ల మధ్య వాగ్వివాదం జరిగింది. గత ఐదు నెలలుగా సమావేశం నిర్వహించకపోవటం, అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకునేందుకు కౌన్సిలర్‌లతో ఎందుకు సమావేశం ఏర్పాటు చేయలేదని వారు ప్రశ్నించారు.

వార్షిక బడ్జెట్‌కు ఆమోదం...

ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన ఖర్చు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అయ్యే ఖర్చుకు నిధులను మంజూరు చేస్తూ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 2024-2025వ ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాలు రూ. 97,90,32000, 2023-2024 ఆర్థిక సంవత్సరం సవరించిన బడ్జెట్ రూ.84,68,71000లకు సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

సమస్యల పరిష్కారానికి నిధులు...

మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి నివారణకు నిధులను ఖర్చుచేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమసింగ్ అధికారులకు సూచించారు. ప్రస్తుత అవసరాలను పక్కన పెట్టి అంతగా అవసరం లేని పనులను ఇపుడు చేపట్టడం ఏమిటని ఆమె ప్రశ్నించినట్టు సమాచారం. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్, వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, డీఈ దివ్యజ్యోతి, ఏఈ సాయిమౌనిక, మేనేజర్ బీఎన్‌కే రమేష్, జేఏఓ వీరస్వామి, టీపీఓ సంతోష్ సింగ్, టీపీఎస్ మణిహారిక, జలమండలి మేనేజర్ స్ఫూర్తిరెడ్డి, కౌన్సిలర్‌లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీకి ఘన నివాళులు



మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అత్తాపూర్ కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్

మణికొండ: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని మణికొండ వాసవి కపుల్స్ క్లబ్ నాయకులు నార్సింగిలోని ఆయన విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వంశీకృష్ణ మాట్లాడుతూ మన స్వాతంత్ర్య పోరాటంలో ముందుండి నడవటంతో పాటు అహింసా మార్గంలో స్వాతంత్య్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి టీ.యశ్వంత్, కోశాధికారి శిరీష, రీజినల్ చైర్మన్ జి.నవీన్‌కుమార్, జిల్లా ఇంచార్జి కిరణ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

◆ అత్తాపూర్: మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీశంకర్ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. బాపూజీ చూపిన సత్యం, అహింస మార్గాలు భావితరాలకు బంగారు బాటలుగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోలన్ సుభాష్ రెడ్డి, ఎం.కోమురయ్య, రామేశ్వర్ రావు, బండారు రమేష్, సోమవారం రాజ్ కుమార్, బాలు, శేఖర్ రెడ్డి, బిట్కూరి హరినాథ్, బిట్కూరి సిద్దేశ్వర్, విష్ణువర్ధన్ రెడ్డి, కిరణ్ చారి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ రాజేంద్రనగర్: మహాత్మాగాంధీ 76వ వర్ధంతిని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని విగ్రహాలతో పాటు పలు ప్రాంతాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బుద్వేల్‌లోని గాంధీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్యాల సాయిమల్లిక్, జాగృతి రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ జి.శ్రావణ్, నియోజకవర్గం యువజన నాయకుడు మజ్జిగ నరేశ్‌యాదవ్‌లు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంతోష్, హరి, కిరణ్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వాసవి కపుల్స్ క్లబ్ నాయకులు



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

మణికొండ: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటతో చేవెళ్ల ఎంపీ స్థానం గెలుపే ధ్యేయంగా పనిచేయాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్ అధ్యక్షతన కోకాపేటలో మున్సిపల్ స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి భారీగా ఓట్లు పెరిగాయన్నారు. పార్లమెంట్ స్థాయిలో బీజేపీకి మెరుగైన ఓట్లు వచ్చాయన్నారు. వారంతా తిరిగి ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేస్తే అభ్యర్థి సునాయాసంగ గెలుపొందుతారన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, ప్రపంచ దేశాలలో భారత్ స్థాయి లాంటి వివరాలను ప్రజలకు ఇప్పటి నుంచే వివరించాలన్నారు. ప్రతి బూత్ స్థాయిలో మెజార్టీ ఓట్లను సాధించేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఎంపీ ఎన్నికల తరువాత వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను గుర్తించి తగు ప్రాధాన్యం ఇస్తామన్నారు. రాష్ట్ర నాయకుడు డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఇంచార్జి అంజన్‌కుమార్‌గౌడ్‌లు మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా ఓబీసీ మోర్చ అధ్యక్షుడు డి.లక్ష్మీనారాయణ, కోకాపేట కౌన్సిలర్ ఆర్. ఆదిత్యరెడ్డి, నాయకులు మల్లేష్ యాదవ్, మహాలింగంగౌడ్, నాగేష్, బాబురావు, జి.శివరాజ్, బుచ్చిరెడ్డి, కె.సురేందర్, ఎం.అనిల్‌కుమార్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై తనిఖీ

శంషాబాద్: జీవో 111 పరిధిలోని అక్రమ నిర్మాణాలను మంగళవారం డీటీసీపీ ప్రాంతీయ డైరక్టర్ నర్సింహారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పక్కనే ఉన్న శ్రీనివాస్ కాలనీలో భారీ ఎత్తున కొనసాగుతున్న అక్రమ నిర్మాణాల తీరుపై అడిగి తెలుసుకున్నారు. అక్రమ నిర్మాణాలను కచ్చితంగా అడ్డుకోవాలని పట్టణ ప్రణాళికా అధికారి శ్రీనివాస్ తదితరులను ఆదేశించారు. హుడా కాలనీ సమీపంలో ఉన్న మరి కొన్ని నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు.



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న రీజనల్ డైరక్టర్ నర్సింహారెడ్డి

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్



నిందితునితో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయి

రాజేంద్రనగర్: గంజాయిని విక్రయిస్తున్న యువకుడిని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం... కాటేదాన్ మధుబన్ కాలనీ ప్రాంతంలో రాహుల్ కుమార్ అనే యువకుడు ధూల్‌పేట్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా ఉన్న కార్మికులకు విక్రయిస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు రాహుల్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని తనిఖీ చేశారు . అతని వద్ద 550 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ధూల్‌పేట్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసినట్లు రాహుల్ వెల్లడించారు. దీనిపై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించమన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మణికొండ: పుప్పాలగూడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని డాలర్స్‌హిల్స్, తిరుమల హిల్స్, బయ్యూత్‌కాలనీ, పీజీ కాలేజీ, ఖిజ్రా ఎన్‌క్లేవ్ కాలనీలలో బుధవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు. విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నామని ఆయన వివరించారు.

రాజేంద్రనగర్: ఉప్పర్‌పల్లి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జలాల్‌బాబానగర్, 9 నంబర్, సెట్విన్ కాలనీ, చింతల్‌మేట్, హరినాథ్ రెడ్డి కాలనీ, డి-మార్ట్, ఫోర్ట్‌వ్యూ కాలనీ, ఫర్మా రెడ్డి హిల్స్, నాయుడు నగర్, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, ఉప్పర్‌పల్లి, వెంకటేశ్వర కాలనీ, ఎర్రబోడ, ప్రకాశ్‌నగర్, గాంధీనగర్ ప్రాంతాల్లో ఈ కోతలు ఉంటాయన్నారు. ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

దేవాలయ భూమిని కాపాడండి



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

మణికొండ: చారిత్రాత్మక హనుమాన్ దేవాలయ భూములను కబ్జాకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణకు నార్సింగి మున్సిపాలిటీ నాయకులు ఫిర్యాదు చేశారు. గండిపేట మండలం, ఖానాపూర్ రెవెన్యూ సర్వేనంబర్ 65లో ఉన్న ప్రభుత్వ భూమిలో హనుమాన్ దేవాలయం ఉందన్నారు. ఇటీవల సదరు భూమిపై తమకు హక్కులు ఉన్నాయని ఓ నిర్మాణ సంస్థ వారు బ్లూషీట్ ప్రహరీలను వేసి పనులను చేపట్టారు. దాంతో గ్రామస్థులు పెద్ద ఎత్తున వెళ్లి పనులను అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవటం వల్లా తిరిగి పనులు చేపట్టడంతో మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చ జిల్లా అధ్యక్షుడు డి.లక్ష్మీనాయణ, స్థానిక కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఏసీపీకి ఫిర్యాదు చేశారు. ఈకార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బిక్షపతియాదవ్, ప్రధాన కార్యదర్శి శివరాజ్, పీఏసీఎస్ చైర్మన్ టి.కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ వెంకటేష్ యాదవ్, నాయకులు సురేష్, రాములు, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

రాజేంద్రనగర్: గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకుని శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. అతడి నుంచి 3.5 కిలోల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ దేవేందర్ కథనం మేరకు... కోకాపేట్ ప్రాంతంలోని రామ్‌కీ కన్‌స్ట్రక్షన్ లేబర్ అడ్డా వద్ద ఒడిస్సాకు చెందిన సౌమ్యరాజన్ మల్లిక్ కార్మికులతో పాటు స్థానిక యువకులు, విద్యార్థులకు చాక్లెట్లను విక్రయించడం ప్రారంభించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది మంగళవారం ఉదయం సౌమ్యరాజన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 3.5 కేజీల గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం శంషాబాద్ ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఏటీఎంలో చోరీకి యత్నం

మణికొండ: ఓ బ్యాంకు ఏటీఎంకు కన్నం వేసేందుకు యత్నించారు దుండగులు. నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హైదర్‌షాకోట్, సన్‌సిటీ వద్ద హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలో కొందరు దుండగులు సోమవారం అర్ధరాత్రి చొరబడ్డారు. వారి వద్ద ఉన్న రాడ్‌లతో ఏటీఎం తెరిచేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సైరన్ మోగటంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో నార్సింగి పోలీసులతో పాటు రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలను సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. బ్యాంకు అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని నార్సింగి పోలీసులు తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయండి

అత్తాపూర్: ఫిబ్రవరి 16న దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మె గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ జి.కవిత అన్నారు. కాటేదాన్‌లోని సీఐటీయు కార్యాలయంలో మంగళవారం రంగారెడ్డి జిల్లా సీఐటీయు, రంగారెడ్డి జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా సదస్సును జిల్లా కార్యదర్శి సునీత, లలిత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవిత మాట్లాడుతూ... ఆశ వర్కర్లకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని 18 సంవత్సరాలుగా ప్రజలకు సేవలందిస్తున్నామని, గతంతో పోలిస్తే పని గంటలు, పని భారం పెరిగింది కానీ... ఆశ వర్కర్లకు వేతనం మాత్రం నేటికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించలేదన్నారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 16న జరగబోయే సమ్మె కరపత్రం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, ఆశ వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న సీజీఎం ఆనంద్ తదితరులు

రాజేంద్రనగర్: రాబోయే వేసవిలో వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఎదుర్కోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రంగారెడ్డి జోన్ సీజీఎం ఆనంద్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి సెక్షన్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు పనులను సీజీఎం ఆనంద్, ఎస్‌ఈ గోపయ్య, డీఈ రత్నాకర్ రావు, డీఈ (లైన్స్) చంద్రశేఖర్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సీజీఎం ఆనంద్ మాట్లాడుతూ... సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ ఆదేశాల మేరకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు లేకుండా మరమ్మతులను చేపట్టి విద్యుత్ సరఫరా నిరంతరం అందించడానికి పనులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గగన్‌పహాడ్ డివిజన్ ఏడీ ఈశ్వర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.